

సమాచార హక్కు చట్టం పట్ల అవగాహనుండాలి : ఎంపిడిఒ

భీమడోలు : సమాచార హక్కు చట్టం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, దాని ప్రయోజనాల గురించి తెలుసుకోవాలని భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. భీమడోలు మండల సమాఖ్య కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్(ఎపిఎం) కె.రత్నకుమారి అధ్యక్షతన సమాఖ్య మండలస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ద్వారా పలు ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. వీటి లబ్ధి అర్హులకు చేరే విధంగా సమాఖ్య సభ్యులు కృషిచేయాలని కోరారు. అనంతరం కొనసాగిన కార్యక్రమంలో సమాచార హక్కు ప్రాధాన్యత, ప్రయోజనాలు ఇతర అంశాల గురించి ఎంపిడిఒ తెలిపారు. అతరువాత సమాఖ్య సభ్యుల ఆధ్వర్యాన నిర్వహించిన సమాచార హక్కు అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. సభ్యులు నినాదాలతో కూడిన ప్లకార్డులతో ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యాలయ సిసిలు నిర్మల, రేఖా రమణి, వెంకటేశ్వరరావు, వరలక్ష్మి, కార్యాలయ సిబ్బంది సావిత్రి పాల్గొన్నారు.

తీరని కష్టం.. నష్టం..!

పరిష్కారానికి నోచుకోని పిజిఆర్ఎస్ సమస్యలు
76 సార్లు ఫిర్యాదు చేసినా అధికారులకు పట్టని భూసమస్య
అర్హతున్నా అందని పింఛన్..
బాధితులు గగ్గోలు
పారిశుద్ధ్య కార్మికురాలి భర్తకు పింఛన్ కట్
గత్యంతరం లేక పిజిఆర్ఎస్‌నే ఆశ్రయిస్తున్న జనం


ప్రజల సమస్యలు వింటున్న జెసి అభిషేక్‌గౌడ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో అర్జీలు ఇస్తున్నా పరిష్కారం కాని పరిస్థితి. ముఖ్యంగా భూముల సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిజిఆర్ఎస్‌కు పదులసార్లు వచ్చి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో పరిస్థితికి ఏమాత్రం సంబంధం లేకుండాపోయింది. జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి 300కుపైగా అర్జీలు ప్రజల నుంచి వస్తున్నాయి. సోమవారం జరిగిన పిజిఆర్ఎస్‌లో సైతం 363 అర్జీలు వచ్చాయి. అర్జీలు స్వీకరించిన జిల్లా ఉన్నతాధికారులు సంబంధిత శాఖల అధికారులకు అప్పగిస్తున్నారు. వారు మండలాల్లోని అధికారులకు పంపుతున్నారు. నెలలు, ఏళ్లు గడిచిపోతున్నాయే తప్ప సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడేనికి చెందిన మహిళ తమ తల్లిదండ్రుల నుంచి వచ్చిన అసైన్డ్ భూమిని ఇంకొకరి పేరున ఆన్‌లైన్ చేశారంటూ ఇప్పటి వరకూ 76 సార్లు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ఫిర్యాదును కనీసం పరిశీలించకుండా స్థానిక అధికారులు మూసేస్తున్న పరిస్థితి ఉంది. అసైన్డ్ భూమి వారసత్వంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వస్తుంది. అంతే తప్ప గ్రామంలోని వేరే వ్యక్తుల తరగతికి చెందిన వ్యక్తుల పేరున ఏవిధంగా ఆన్‌లైన్ చేస్తారో ఎవ్వరికీ అర్థం కాని పరిస్థితి. కొయ్యలగూడెం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి చెందిన ఇంటి స్థలం అదే కుటుంబంలోని వేరొకరి పేరున అధికారులు రాసిచ్చేశారని బాధితుడు గగ్గోలు పెడుతున్నారు. స్థానిక విఆర్ఒ తమ గోడు ఏమాత్రం పట్టించుకోవడం లేదని బాధితుడు నెత్తినోరు మొత్తుకుంటున్నారు. ఇలా అనేక భూసమస్యలు పిజిఆర్ఎస్‌కు వస్తున్నా పరిష్కారం మాత్రం కావడం లేదు. రీసర్వేలో తమ భూమి విస్తీర్ణం తేడా వచ్చిందని కొంతమంది, పట్టా తమ పేరున ఉన్నా ఆన్‌లైన్‌లో వేరేవారి పేరు చూపిస్తుందని కొంతమంది, పట్టా భూమిని ప్రభుత్వ భూమికి నమోదు చేశారని మరికొంతమంది, ఇలా ఎంతోమంది బాధితులు రెవెన్యూ సమస్యలతో పిజిఆర్ఎస్‌ను ఆశ్రయిస్తున్నారు. అయితే ఎన్నిసార్లు తిరిగినా సమస్య మాత్రం పరిష్కారం కాకపోవడం వారందరినీ తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. సమస్యను పరిష్కరించే ఉద్దేశం అసలు రెవెన్యూ అధికారులకు ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అర్హతున్నా పింఛన్లు రావడం లేదని పిజిఆర్ఎస్‌లో ప్రతివారం పెద్దఎత్తున ఫిర్యాదులు అందుతున్నా పరిష్కారం మాత్రం చూపడం లేదు. ఫిర్యాదులు తీసుకోవడం, సమీక్షలు చేయడం తప్ప సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. కూటమి ప్రభుత్వం పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారంపై గట్టి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.



76 సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

గుద్దాటి భూలక్ష్మి, మైసన్నగూడెం, జంగారెడ్డిగూడెం మండలం

మైసన్నగూడెం గ్రామంలోని సర్వే నెంబర్ 120-2లో మా తల్లిదండ్రులకు 2.13 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. 50 ఏళ్లుగా మా కుటుంబమే సాగు చేస్తోంది. ప్రస్తుతం ఆ భూమి మా ఆధీనంలోనే ఉంది. మా తల్లిదండ్రులు చనిపోయారు. ఏడాదిన్నర క్రితం మా భూమిని గ్రామంలోని వేరొకరి పేరున ఆన్‌లైన్ చేశారు. మా తల్లిదండ్రుల సంతానమైన తమ పేరున మార్చాలని ఇప్పటి వరకూ 76 సార్లు ఫిర్యాదు చేశాను. అధికారులు నా మాట్లాడకుండానే ఫిర్యాదు ముగించేస్తున్నారు. మాకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నాను.

లేవలేని స్థితిలో ఉన్నా పింఛన్ రూ.ఆరు వేలే ఇస్తున్నారు

కూనపాము రాజు, వేదాంతపురం, కొయ్యలగూడెం మండలం

లేవలేని స్థితిలో ఉన్నాను. ఇంట్లో వాళ్లే అన్నీ చేయాలి. ప్రస్తుతం రూ.ఆరు వేల పింఛన్ మాత్రమే ఇస్తున్నారు. రూ.15 వేలు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.





నా స్థలం వేరొకరి పేరున పట్టా ఇచ్చేశారు

వాసిరెడ్డి సత్యనారాయణ, సరిపల్లి, కొయ్యలగూడెం మండలం

నాకు 60 ఏళ్లు. మా అన్నదమ్ములు పేసుకున్న ఆస్తి పంపకాల్లో మూడు సెంట్లు స్థలం వచ్చింది. ఆ స్థలాన్ని అధికారులు మా కుటుంబంలోని వేరొకరి పేరున పట్టా ఇచ్చేశారు. స్థానిక రెవెన్యూ అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడం లేదు. నా స్థలం ఇప్పించాలని కోరుతున్నాను

నా భార్య పారిశుద్ధ్య కార్మికురాలని నా పింఛన్ ఆపేశారు

బూరగ మోషే, కత్తేపువారి వీధి, ఏలూరు

నాకు పక్షవాతం రావడంతో వెన్నెముక, నరాలు దెబ్బతిన్నాయి. పూర్తిగా అంగవైకల్యం ఏర్పడటంతో మంచానికే పరిమితమయ్యాను. నా భార్య విమల ఏలూరు కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. గత ప్రభుత్వంలో పింఛన్ వచ్చేది. ఈ ప్రభుత్వం వచ్చాక నిలిపివేసింది. మందులకు, వైద్యానికి నిమిత్తం ప్రతినెలా చాలా ఖర్చవుతోంది. అనారోగ్యంతో మంచానికే పరిమితమైన నాకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు ఇచ్చాను.



'పోలవరం'లో చేర్చాలి

షెడ్యూల్డ్ మండలాలు, నాన్‌షెడ్యూల్డ్ గ్రామాలను

సిపిఎం ఆధ్వర్యాన మాధవరం సచివాలయం వద్ద ధర్నా


వినతి అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గ పరిధిలోని షెడ్యూల్డ్ మండలాలు, నాన్ షెడ్యూల్డ్ ఆదివాసీ గ్రామాలను చేర్చాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మాధవరం సచివాలయం ముందు సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు గిరిజన ప్రాంతాలు, ముంపు మండలాలను కలిపి పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తానని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు పోలవరం నియోజకవర్గాన్ని మినహాయించి పోలవరం జిల్లాను ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. పాలనా సౌలభ్యం, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని చింతూరు, రంపచోడవరం డివిజన్లతోపాటు పోలవరం నియోజకవర్గాన్ని కలిపి ప్రత్యేక గిరిజన జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, నేతలు మేడిపల్లి బాబు, నాగరాజు, బాలరాజు, నాగేంద్ర, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ అధికారులను ఆదేశించారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తోపాటు డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, భాస్కర్, దేవకీదేవి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, సర్వే శాఖ ఎడి అన్సారీ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి అభిషేక్ గౌడ మాట్లాడుతూ ఆయా శాఖలవారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేదని స్పష్టం చేశారు. సమస్యలకు క్షేత్ర స్థాయిలోనే పరిష్కార మార్గాలు చూపించి అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు.

రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ఎల్‌డిఎం నీలాద్రి



మాట్లాడుతున్న ఎల్‌డిఎం నీలాద్రి

ప్రజాశక్తి - భీమడోలు


బ్యాంక్ లింకేజీ రుణాల కోసం ఆన్‌లైన్ విధానం, బయోమెట్రిక్ నమోదు ఆధారిత విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ నీలాద్రి కోరారు. భీమడోలు మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం భీమడోలు క్లస్టర్ పరిధిలోని ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, ద్వారకాతిరుమల మండలాలస్థాయి జాయింట్ లెవెల్ బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణలో సెర్ప్ జిల్లా ప్రతినిధులు భూషణం, కిషోర్‌తోపాటు భీమడోలు ఎపిఎం కె.రత్నకుమారి సహకరించారు. నాలుగు మండలాలకు చెందిన వివిధ బ్యాంకుల మేనేజర్లు విధి నిర్వహణలో రుణాల మంజూరు విషయమై తమకున్న సందేహాలను అడిగారు. ప్రభుత్వ పథకాల అమలు, వాటి కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. అనంతరం ముఖ్యఅతిథి ఎల్‌డిఎం మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణాల మంజూరు వారి వద్ద వారి వివరాలు బ్యాంకర్ లాగిన్‌లో నమోదైన తర్వాతే అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన ఎపిఎంలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గళమెత్తిన సహకార ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని


డిసిసిబి బ్రాంచి కార్యాలయాల వద్ద ధర్నాలు


ముసునూరులో వినతి అందిస్తున్న ఉద్యోగులు


కొయ్యలగూడెంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన


ఆగిరిపల్లిలో..


కామవరపుకోటలో..


భీమడోలులో..


నూజివీడులో నినదిస్తున్న సహకార ఉద్యోగులు

ప్రజాశక్తి - భీమడోలు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల యూనియన్ ఐక్యవేదిక (జెఎసి) ఆధ్వర్యంలో స్థానిక డిసిసిబి శాఖ పరిధిలోని ఐదు సహకార సంఘాలకు చెందిన అధికారులు, సిబ్బంది సోమవారం డిసిసిబి శాఖ వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు మండల కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు ధర్నాకు సంఘీభావం తెలిపారు. జెఎసి జిల్లా కోశాధికారి ఎం.వీరయ్య, వెంకటేశ్వరరావు మాట్లాడారు. తమ 12 డిమాండ్లను అంగీకరించాలని కోరుతూ డిసిసిబి బ్రాంచి మేనేజర్ రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు. సమస్యలు పరిష్కారం కాకుంటే ఈ నెల 16న ఏలూరులోని డిసిసిబి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సహకార సంఘాల సిఇఒలు జె.రాంబాబు (గుణ్ణంపల్లి), పి.శివకుమార్ (పూళ్ల), సుబ్బారావు (భీమడోలు), పెద్దిరాజు (సీతంపేట) నాయకత్వం వహించారు.

జంగారెడ్డిగూడెం: సొసైటీ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక డిసిసిబి బ్రాంచి వద్ద ధర్నా నిర్వహించారు. సొసైటీల్లో ఖాళీగా ఉన్న సిఇఒ పోస్టులను సీనియారిటీ ఆధారంగా డిఎల్‌సి కమిటీ పర్యవేక్షణలో భర్తీ చేయాలని, ఇతర ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ధర్నాకు డిసిసిబి బ్రాంచి మేనేజర్ సుధాకర్, బ్యాంకు సూపర్‌వైజర్ సీతారాం మద్దతు తెలిపి మాట్లాడారు.

ముసునూరు: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సొసైటీ ఉద్యోగులు స్థానిక కెడిసిసి బ్రాంచి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దీనికి సొసైటీ కార్యదర్శులు పి.దుర్గారావు, కె.ప్రసాద్‌రావు, పి.వెంకటేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, డి.లక్ష్మణ్‌కుమార్, ఎ.జానకీరాం, కె.పార్వతి నాయకత్వం వహించారు. కెడిసిసి బ్యాంక్ చీఫ్ మేనేజర్ తలారి వెంకటరంగ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శులు మాట్లాడుతూ జిఒ నెం.36 అమలు చేసి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, 2019, 2024 వేతన సవరణలు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, ఉద్యోగులకు రూ.ఐదు లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా కల్పించాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వలసపల్లి, ముసునూరు, చెక్కపల్లి, చింతలవల్లి, కాట్రేనిపాడు, గోపవరం, కొర్లకుంట గ్రామాల సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ జెఎసి పిలుపు మేరకు స్థానిక డిసిసిబి బ్రాంచి వద్ద సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం ధర్నా చేపట్టారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని నినదించారు.

కొయ్యలగూడెం: స్థానిక డిసిసిబి బ్రాంచి వద్ద సొసైటీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు కెవివి.సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగుల వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని, జిఒ నెం.36ని అమలు చేయాలని, 2019లో చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ ఉద్యోగులకు కనీసం ఐదు లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని, ఉద్యోగి సర్వీసులో మరణిస్తే వారి కుటుంబాలకు భరోసా కల్పించేలా రూ.20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిసిసిబి బ్రాంచి మేనేజర్ కనక మహాలక్ష్మికి వినతి అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్‌ల సిఇఒలు జి.తులసిప్రసాద్ (కన్నాపురం), ఆర్.నాగేశ్వరరావు (రామానుజపురం), కెవివి.సత్యనారాయణ (డిప్పకాయలపాడు), సుబ్రహ్మణ్యం (కొయ్యలగూడెం), ఆర్.సత్యనారాయణరాజు (గవరవరం), రవి (బయ్యన్నగూడెం), నాగేశ్వరరావు (సరిపల్లి), షేక్ జిలాని, బెల్లాన మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఎపి వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సొసైటీ ఉద్యోగులు స్థానిక డిసిసిబి బ్రాంచి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి మండల వ్యవసాయ సహకార సంఘాల యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బెజవాడ రాజారమేష్‌బాబు, కోలంటి రవీంద్రకుమార్ మాట్లాడారు. నిర్వహించారు. ఈ సందర్భంగా జీతభత్యాలను డ్యూటు పద్దులను రద్దు చేయాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, రైతులకు సంఘాల ద్వారానే పంట రుణాలు ఇవ్వాలని, సంఘాల షేర్ ధనంపై ఆరు శాతానికి తగ్గకుండా డివిడెండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహకార సంఘాల సిఇఒలు జె.శ్రీనివాసరావు, ఎం.రంగారావు, ప్రకాశరావు, మధు, హైమావతి, అనూష, ఫణీంద్ర, నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: పట్టణంలోని కెడిసిసి బ్రాంచి వద్ద సోమవారం పిఎసిఎస్ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి కోఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ గ్రాడ్యూటీ సీలింగ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పిఎసిఎస్‌ల్లో తగిన మేరకు సిబ్బందిని తక్షణమే నియమించాలని కోరారు. పిఎసిఎస్‌ల్లోని అపరిష్కృత సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పిఎసిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కామవరపుకోట: సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల ఐక్య వేదిక రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక డిసిసిబి బ్రాంచి వద్ద సొసైటీల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ నెం.36 వెంటనే అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడతామన్నారు. ధర్నాలో కె.జగ్గవరం, మధ్యాహ్నపువారిగూడెం, మల్లుకుంట సొసైటీల సిఇఒలు టి.వీరవెంకయ్య, జి.భుజంగరావు, యు.సత్యనారాయణ పాల్గొన్నారు.

మండవల్లి: వ్యవసాయ సహకార సంఘాల్లో పని చేసే ఉద్యోగుల న్యాయమైన కోరికలను తీర్చాలని ఎఐబిఇఎ, సిఐటియు ఆధ్వర్యంలో మండవల్లి బ్రాంచి పరిధిలోని ఏడు సహకార సంఘాల సిబ్బంది స్థానిక డిసిసిబి బ్రాంచి వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ దీర్ఘకాలిక సమస్యలను తక్షణం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కలిదిండి: స్థానిక డిసిసిబి బ్రాంచి ఎదుట వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటరత్నం, వెంకట సుబ్బరాజు, రాజేంద్ర ప్రసాద్, సురేష్, పి వి సుబ్రహ్మణ్యం, ప్రసాదరావు, వెంకటేశ్వరరావు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల విస్తరణకు అధిక ప్రాధాన్యత

ఎంఎల్ఎ బడేటి చంటి



రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అభివృద్ధిలో భాగంగానే అవసరమైన ప్రాంతాల్లో రహదారుల విస్తరణ పనులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఇదే లక్ష్యంతో భవిష్యత్తులో మరిన్ని రహదారుల నిర్మాణానికి దశలవారీగా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం జంగారెడ్డిగూడెం రోడ్డులో తంగెళ్లమూడి వద్ద రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. అనంతరం ఆ ప్రాంతంలోని దుకాణ యజమానులతో మాట్లాడారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా వాహనాలు పార్కింగ్ చేసేలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులను శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఇదేక్రమంలో తంగెళ్లమూడి రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎన్‌క్యాప్ నిధులు రూ.కోటి 10 లక్షలు, కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ రూ.24 లక్షలు మొత్తం కలిసి రూ.కోటి 34 లక్షలతో ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టామన్నారు. ఎండ్ టూ ఎండ్ రోడ్డే లక్ష్యంగా అన్ని ప్రాంతాల్లోనూ ఇదే విధానాన్ని అవలంభించనున్నామన్నారు. తద్వారా వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయని వెల్లడించారు. ఇదేక్రమంలో ఇక్కడి దుకాణ యజమానులు పార్కింగ్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా లారీలను రోడ్డు పక్కన నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో లారీ యజమానులు కూడా సహకరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, డిప్యూటీ మేయర్ వందనాల శ్రీనివాస్, కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌ఛార్జి రెడ్డి నాగరాజు, డివిజన్ ఇన్‌ఛార్జి నెరుసు గంగరాజు, లంకలపల్లి ప్రసాద్ ఉన్నారు.

యుటిఎఫ్ టెస్ట్ పేపర్లు వినియోగించుకోవాలి

ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు


టెస్ట్ పేపర్లు అందిస్తున్న ఉపాధ్యాయులు

మండవల్లి: పదవ తరగతి విద్యార్థులు మోడల్ టెస్ట్ పేపర్లను సద్వినియోగం చేసుకుని నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని లోకముడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు అయ్యవారి రుద్రవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరిగిరి పిచ్చోడు, పెరికే గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు డివి.సుబ్రహ్మణ్యం ఆర్థిక సహాయంతో లోకుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 28 మంది విద్యార్థులకు యుటిఎఫ్ ముద్రించిన మోడల్ టెస్ట్ పేపర్లను ఆయన చేతుల మీదుగా సోమవారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులు విద్యలో రాణించాలనే లక్ష్యంతో యుటిఎఫ్ శాఖకు చెందిన ఉపాధ్యాయులు ఈ మోడల్ పేపర్లను తయారు చేయడం జరిగిందన్నారు. పది పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో ఈ మోడల్ పేపర్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు ఈ టెస్ట్ పేపర్లను ఉపయోగించుకుని నూరు శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల జనరల్ సెక్రెటరీ ఆనంద్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడ శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిరిగిరి పిచ్చోడు, ఉపాధ్యాయులు సనావుల్లా మస్తాన్ పాల్గొన్నారు.

పోలీసుల వినూత్న చర్య

నేరస్తులను నడిపించుకుని తీసుకెళ్లి కోర్టులో హాజరు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

యువతిపై సస్పెక్ట్ షీట్ హోల్డర్ అత్యాచారం కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి సోమవారం రాత్రి కోర్టులో హాజరుపరిచారు. నేరాలు చేసే వారికి గుణపాఠం నేర్పించేందుకు ఏలూరు టూ టౌన్ పోలీసులు వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నేరానికి పాల్పడిన ఏలూరు లక్ష్మీరావు పేటకు చెందిన సస్పెక్ట్ షీటర్ పులిగడ్డ జగదీష్ బాబు అలియాస్ జగదీష్, కొత్తపేటకు చెందిన రెండవ ముద్దాయి లావేటి భవానీకుమార్, ఏలూరు కొత్తపేటకు చెందిన అక్కెటి ధనుష్ అనే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిని ఏలూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి కోర్టు వరకు నడిపించుకుంటూ తీసుకువెళ్లారు. నేరస్తుల్లో భయం కలిగించడానికి, మరే నేరాలు చేయకుండా ఉండేందుకు ఇటువంటి చర్యలు తీసుకుంటున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలుపుతున్నారు. న్యాయమూర్తి వీరికి 14 రోజుల రిమాండ్ విధించారు.


నేరస్తులను నడిపించుకుని తీసుకెళ్తున్న పోలీసులు

డివైఎఫ్ఐ నగర నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా ఎ.శరత్‌చంద్ర, పి.శివశంకర్


శరత్‌చంద్ర, శివశంకర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భారత ప్రజాతంత్ర యువజన సమైక్య(డివైఎఫ్ఐ) ఏలూరు నగర అధ్యక్షులుగా ఎ.శరత్‌చంద్ర, నగర కార్యదర్శిగా పి.శివశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆ సంఘం జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ తెలిపారు. ఆదివారం స్థానిక అన్నే భవనంలో నగర కమిటీ ఎన్నిక నిర్వహించగా సోమవారం సూర్యకిరణ్ కమిటీ వివరాలు వెల్లడించారు. డివైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులుగా ఎల్.రాజేష్, జి.శివ, బి.లోకేంద్ర, సహాయ కార్యదర్శులుగా మనోజ్, ఎ.బన్నీ ఎన్నికయ్యారని, నగర కమిటీ సభ్యులుగా టి.పవన్ కళ్యాణ్, టి.దుర్గ ప్రసాద్, ఎం.హరి తేజ, డి.దిలీప్, ఎ.అనిల్ చందు, ఎస్.చిన్న, ఎం.లీలా మహి, ఆర్.శివకృష్ణలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పిజిఆర్ఎస్‌కు వచ్చే ప్రజలకు భోజన సదుపాయం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్) కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతుంటారు. జిల్లాలోని పలు గ్రామాల నుండి సుమారు 300 మందికిపైగా ప్రజలు తమ అర్జీలు సమర్పించడానికి వస్తున్నారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగుతుండగా దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు భోజనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి గమనించారు. ప్రజల సమస్యను అర్థం చేసుకున్న ఆమె ఏలూరు స్టేట్ బ్యాంక్‌కు పక్కన ఉన్న అన్న క్యాంటీన్ నుండి భోజనాలను తెప్పించేలా చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోనే భోజన సదుపాయం కల్పించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ కలెక్టర్ వెట్రి సెల్వి సేవాభావాన్ని ప్రశంసించారు. ప్రజల కోసం అధికార యంత్రాంగం ఇలాంటి సంకల్పంతో ముందుకు రావడం అభినందనీయమని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ ఉన్నత పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ఏలూరు ఒకటవ డివిజన్‌లోని ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలను సోమవారం ఏలూరు ఉప విద్యాశాఖాధికారిణి నిమ్మగడ్డ రవీంద్ర భారతి సందర్శించి పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టీలు, ఎస్సెస్‌మెంట్ బుక్స్ పరిశీలించారు. అటెండెన్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, లాంగ్ ఆబ్సెంట్ లేకుండా చూడాలని, నైతికవిలువలు, విద్యా, సామాజిక విలువలు నేర్పించాలని, విద్యార్థులను క్రమశిక్షణతో కూడిన విద్య నేర్పించాలని విద్యార్థుల విషయంలో గతంలో వివిధ ప్రాంతాలలో జరిగిన, జరుగుతున్న పలు ఇబ్బందికర సంఘటనలు ఉదాహరణలతో ఉపాధ్యాయులకు వివరించారు. అలాగే పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు తెలియపరచాలని, కొన్ని విలువైన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఇదే సమయంలో వంట శాలను సందర్శించి ఏజెన్సీ, స్వీపర్లకు, వ్యాయామ ఉపాధ్యాయులకు తగు సలహాలు, సూచనలు అందజేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఆడమిల్లి విద్యార్థి

ప్రజాశక్తి - కామవరపుకోట

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంటా రవిచంద్రమోహన్ సోమవారం తెలిపారు. నవంబర్ 28 నుండి 30వ తేదీ వరకు చిత్తూరు జిల్లా కలికిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలో అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కొండపర్తి పూజిత విశేష ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ విద్యార్థిని త్వరలో రాజస్థాన్ రాష్ట్రంలో జరగబోయే జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటున్నారు. విద్యార్థినిని, ఈమెకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మానుకొండ సుబ్బారావును పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

వికలాంగులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మానవత సేవలో భాగంగా 'మానవసేవే మాధవసేవ' అనే సూత్రాన్ని ఆచరణలో పెడుతూ ప్రముఖ సంఘ సేవకులు గంగిరెడ్డి మేఘలాదేవి, తాడికొండ మురళీకృష్ణ వికలాంగులు, వృద్ధులు, పేదలకు సహాయం చేయడం ద్వారా లభించే ఆనందం, మనశాంతి అమూల్యమని పేర్కొన్నారు. ప్రపంచ వికలాంగుల వారోత్సవాల సందర్భంగా కన్నాపురం రోడ్‌లోని వికలాంగుల ఆశ్రమం వద్ద సర్పంచ్ ముప్పిడి విజయకుమారి అందించిన ఆర్థిక సహాయంతో 20 మంది వికలాంగులకు 20 రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు అందరికీ ప్రేరణ కావాలని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ ముప్పిడి చినబాబు, నాయకులు ఏలేటి చంద్రం, డిడిపి రవి, గున్నేపల్లి సుబ్బారావు, కారం భీమరాజు, వికలాంగ పిల్లల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఈనెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ సూచించారు. నూజివీడులో జడ్జి నాగ శైలజ సోమవారం మాట్లాడుతూ రాజీకి రాదగిన కేసులు, చెక్ బౌన్స్ కేసులను రాజీమార్గం ద్వారా కక్షిదారులు పరిష్కరించుకోవాలన్నారు. కేసులతో డబ్బు, సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ పడి, పరిష్కారమయ్యే దిశగా కృషి చేయాలని పోలీసులు, న్యాయవాదులను కోరారు.

చింతలపూడి : స్థానిక చింతలపూడి జూనియర్ సివిల్ కోర్టులో ఈనెల 13వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధు బాబు కోరారు. సోమవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చింతలపూడి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.మాణిక్యాలరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో సమస్యల పరిష్కారం

సబ్ కలెక్టర్ బి.వినూత్న

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజాసమస్యల పరిష్కార వేదిక మీకోసం అనే కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించడం జరుగుతుందని సబ్ కలెక్టర్ బి.వినూత్న తెలిపారు. నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ బి.వినూత్న మాట్లాడుతూ ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. జటిలమైన సమస్యలు పరిష్కారం కాకపోతే.. వాటి వివరాలను అర్జీదారులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు మొత్తం 40 రకాలైన సమస్యలను అర్జీల రూపంలో అందించినట్లు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 4 అర్జీలు

ద్వారకాతిరుమల : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఎంపిడిఒ పివివి.ప్రకాష్ అధ్యక్షతన మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ విభాగానికి సంబంధించి నాలుగు అర్జీలు అందినట్లు సంబంధిత అర్జీలను రెవెన్యూ శాఖకు బదిలీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల తహశీల్దార్ జెవి.సుబ్బారావు, ఎంఇఒ వెంకట్రావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, అంగర సురేష్ పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించుకోవాలి

తహశీల్దార్ షేక్ లతీఫ్ పాషా

ముదినేపల్లి: రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే విక్రయించుకోవాలని మండల తహశీల్దార్ షేక్ లతీఫ్ పాషా, ఎఒ వేణుమాధవ్ అన్నారు. మండలంలోని దాకరం పరిసర ప్రాంతాల్లో సోమవారం పర్యటించి రైతులతో సమావేశమై ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం పూర్తిస్థాయిలో 17 శాతం తేమ వచ్చు వరకు ఆరబెట్టుకుని సమీపంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించిన ఎడల ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర పొందవచ్చన్నారు. క్వింటాల్‌కి కామన్ రకాలు అయితే రూ.2,369, ఎ గ్రేడ్ రకాలైతే రూ.2,389 చొప్పున పొందవచ్చన్నారు. ఈ విషయంలో రైతులెవరూ దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు అవసరమైన సంచులు, కూలీ ఖర్చులు, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు కూడా ప్రభుత్వమే భరించి పైన పేర్కొన్న మద్దతు ధర కల్పిస్తున్నామన్నారు.

పోలవరం రైట్ మెయిన్ కెనాల్ నుంచి నీరందించాలని వినతి

దెందులూరు: ఆరునెలల పాటు కృష్ణ కెనాల్ మూసివేయడం ద్వారా పెదపాడు, ఏలూరు రూరల్ మండల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడతారని, వారికి పోలవరం రైట్ మెయిన్ కెనాల్ నుంచి నీరు అందించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జెసిని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ కోరారు. కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం ఉదయం జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని జెసి అభిషేక్ గౌడ్ కి వినతిపత్రం అందజేశారు. కృష్ణ ఏలూరు కాలువ 12 కిలోమీటర్ల వద్ద నిర్మాణ నిమిత్తం 01 జనవరి 2026 నుంచి జూన్ నెల వరకు దాదాపు ఆరు నెలల పాటు కృష్ణ కెనాల్ మూసివేస్తున్నారని తెలిపారు. ఈ విధంగా జరగడం ద్వారా పెదపాడు, ఏలూరు రూరల్ మండల ప్రజలు నీటి అవసరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా పోలవరం రైట్ మెయిన్ కెనాల్ నుంచి నీటిని అందించే చర్యలు చేపట్టాలని జెసిని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

నిర్వాసితుల కాలనీకి రోడ్డేది..?

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని వేడుకోలు




దారి మధ్యలో నిర్మించిన బ్యారెన్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వస్వాన్ని త్యాగం చేసి ప్రభుత్వం చూపించిన పునరావాస కాలనీలకు తరలివచ్చిన నిర్వాసితులకు, వారు నివసిస్తున్న కాలనీలకు ప్రభుత్వం కనీసం రోడ్డు మార్గాన్ని కూడా ఏర్పాటు చేయలేదు. రెడ్డి గణపవరం గ్రామ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన తూటిగుంట నిర్వాసితుల కాలనీకి రోడ్డు నిర్బంధిస్తూ, అక్రమ కట్టడాలను నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరినా స్థానిక తహశీల్దార్, విఆర్ఒలు కనీసం పట్టించుకోలేదు. కొంతమంది గిరిజనేతర వ్యక్తులు ప్రభుత్వ స్థలాలను సైతం ఆక్రమించి గిరిజన చట్టాలకు విరుద్ధంగా అమ్మకాలు, కొనుగోలు జరుపుతున్నారని ఫిర్యాదులు చేసినా స్పందించకపోవడం అన్యాయం. సర్వే నెంబర్ 235, 234లలో గయ్యాల, ప్రభుత్వ భూములు గుర్తించి, సర్వే నిర్వహించి ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను వెలికి తీయాలని ఫిర్యాదులు చేసినా రెవెన్యూ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఈజ్‌మెంట్ యాక్ట్ 1882 చట్టం గురించి కూడా కనీస అవగాహన లేకపోవడం బాధాకరం. యాక్ట్ ప్రకారం 20 ఏళ్లు పైగా వ్యక్తిగత ప్రాపర్టీని కూడా రహదారిగా ఉపయోగిస్తే దాన్ని నియంత్రించడానికి సదరు యజమానులకు ఏవిధమైన హక్కు ఉండదని ఈజ్‌మెంట్ రైట్స్ చెబుతున్నాయి. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడమే కాకుండా నిర్వాసితులకు దారిని నిర్బంధించినా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం, చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న వ్యక్తులపై ఏవిధమైన చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రభుత్వం స్పందించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

నిర్వాసితుల పట్ల రెవెన్యూ అధికారుల వివక్ష

మంగరాజు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు



నిర్వాసితుల రహదారి సమస్యపై స్థానిక ఎంఎల్ఎ చిర్రి బాలరాజును నిర్వాసితులు కలిసి తమ సమస్యను విన్నవించినా, ఎంఎల్ఎ వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించినా ఎటువంటి పరిష్కారం చేయలేదు. కాగా స్థానిక టిడిపి నేతలు అండదండలతో తహశీల్దార్, విఆర్ఒ కూడా రహదారిని నిర్బంధిస్తున్న గిరిజనేతరులకు అనుకూలంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గం.

పోస్టుమార్టానికి భారీ వసూళ్లపై విచారించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు అర్బన్ : ఏలూరు బోధన ఆసుపత్రి పోస్ట్‌మార్టం విభాగంలో ధన దాహానికి మృతదేహాలను సైతం వదలని దుస్థితి నెలకొందని, జాలి, దయ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పోస్ట్‌మార్టం చేసేందుకు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు వస్తున్న వార్తలపై వెంటనే ఉన్నతాధికారులతో విచారణ జరిపించి, అవినీతికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎంతో పేరుగాంచిన ఏలూరు జిల్లా ఆసుపత్రి బోధన ఆసుపత్రిగా మారిన తరువాత పరిస్థితులు అత్యంత దారుణంగా మారాయని ఆయన విమర్శించారు. రోడ్డు ప్రమాదాలు, పురుగుమందులు తాగిన కేసులు ఎక్కువగా ఈ ఆసుపత్రికి వస్తుంటాయని, చికిత్స అందించిన ఒక్కోసారి పరిస్థితి వికటించి మరణిస్తుంటారని, అలాంటి కేసుల్లో పోస్ట్ మార్టం తప్పనిసరి అవుతుందని పేర్కొన్నారు. చనిపోయిన వ్యక్తికి చెందిన కుటుంబాలు బాధలో ఉంటే పోస్ట్‌మార్టం చేసేందుకు సంబంధిత వైద్యులు భారీగా డబ్బులు వసూలు చేయడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారైతే అడిగినంత డబ్బులు ఇవ్వలేక నానాయాతనలు పడుతున్నారని, అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే పోస్ట్ మార్టం ఆలస్యం చేయడం, తరువాత డెత్ సర్టిఫికెట్ ఇవ్వరనే భయంతో అప్పో సొప్పో చేసి మరీ అడిగినంత డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక అంచనా ప్రకారం నెలకు ఆసుపత్రికి దాదాపు 45 నుండి 50 వరకు పోస్ట్ మార్టం కేసులు వస్తుంటాయని, ఒక్కో మృతదేహానికి కనీసం రూ.5 వేల చొప్పున లెక్క వేసుకున్నా దాదాపు రూ.2.50 లక్షల అవినీతి జరుగుతుందని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కోరారు. ఉన్నతాధికారులతో విచారణ జరిపించి, అవినీతికి పాల్పడుతున్న వైద్యులు, సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అరకు గిరిజన స్పోర్ట్స్ గురుకుల పాఠశాల పరిశీలన



అభినందిస్తున్న జగదీశ్వరి

పోలవరం : అరకు గిరిజన స్పోర్ట్స్ గురుకుల పాఠశాలలోని మౌలిక సదుపాయాల పరిస్థితిని, విద్యార్థులకు అందుతున్న సేవలను స్వయంగా పరిశీలించేందుకు ఎపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి సోమవారం పాఠశాలను సందర్శించారు. జోనల్ ఆర్‌టిసి ఛైర్మన్ శివేరి దున్నుదొర కూడా ఈ పరిశీలనలో ఆమెతో కలిసి పాల్గొన్నారు. పాఠశాలలో క్రీడా విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పుస్తకాల పంపిణీ, హాజరు రికార్డులు, శిక్షణ సామగ్రి వంటి అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. క్రీడలలో ప్రతిభను ప్రదర్శిస్తున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

పిల్లల సమగ్రాభివృద్ధే లక్ష్యం

స్ట్రీట్ కాజ్ సిఎంఆర్ సిఐటి సంస్థ

పోలవరం : గూటాల జిల్లా పరిషత్ హైస్కూల్లో స్ట్రీట్ కాజు సిఎంఆర్ సిఐటి సేవా కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తు కోసం సమాజంలోని యువశక్తి ముందుకు వస్తే మార్పు తప్పదని మరోసారి చాటుతూ స్ట్రీట్ కాజ్ సిఎంఆర్ సిఐటి సంస్థ ఆదివారం జెడ్‌పిహెచ్ స్కూల్ గుటాలలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు చేపట్టింది. ఐదు విభాగాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించడం విద్యార్థుల్లో ఉత్సాహం నింపింది. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు కెహెచ్ఇఎల్ ఉజ్వల్ కార్యక్రమం ద్వారా క్రీడా సామగ్రిని స్ట్రీట్ కాజ్ సభ్యులు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచే క్రమంలో గ్రీన్ ఇంప్రెషన్స్‌లో భాగంగా కాలుష్యం అంశంపై చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. 10వ తరగతి విద్యార్థుల బోర్డు పరీక్షల సిద్ధతకు తోడ్పడేలా విద్యా సహాయ కార్యక్రమం ద్వారా పరీక్షా కిట్లను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి విచ్చేశారు. కార్యక్రమంలో పోలవరం ఎంఇఒ, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పిహెచ్‌డి

ఆగిరిపల్లి : మండల పరిధిలోని పోతవరప్పాడు ఎన్ఆర్ఐ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఐనంపూడి ప్రసన్న కుమార్‌కు వెల్ టెక్ యూనివర్శిటీ చెన్నై వారిచే ప్రధానం చేయబడిన పిహెచ్‌డి పట్టాను సోమవారం కళాశాల ఛైర్మన్ రావి వెంకట్రావు అందజేశారు. వెల్‌టెక్ యూనివర్శిటీ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్యులు డాక్టర్ పి.చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఎనాలిసిస్ అండ్ డిజైన్ ఆఫ్ నోవెల్ సాఫ్ట్ స్విచ్చింగ్ హై ఓల్టేజ్ గైన్ డిసి టు డిసి కన్వర్టర్స్ ఫర్ రెన్యూవబుల్ ఎనర్జీ అప్లికేషన్స్ అను అంశంపై పరిశోధన చేయడం వల్ల ప్రసన్న కుమార్‌కు పిహెచ్‌డి పట్టాను ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ రావి.వెంకట్రావు, ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ డి.కైలాసరావు, ఎన్.సాంబశివరావు, ఎన్.మాధవరావు, అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది ప్రసన్నన కుమార్‌ను అభినందించారు.

శీతాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారి డాక్టర్ నవ్య

ఏలూరు సిటీ: ఏలూరు, ఆమదాల అప్పలస్వామి కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవ్య శీతాకాలంలో సంభవించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శరీర నొప్పులు, కండరాల నొప్పి, కాటు వేసిన ప్రాంతంలో నల్లటి పుండులా కనిపించే మచ్చ, దద్దుర్లు, గ్రంధులు ఉబ్బడం, వణుకు, చలిగా అనిపించడం వంటి లక్షణాలు ఉంటే వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఇవి స్క్రబ్ టైఫస్ లక్షణాలు కావచ్చని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లులు, గేదెలు, ఆవులు మొదలైన జంతువులను ముట్టుకున్న తర్వాత తప్పనిసరిగా చేతులు, కాళ్లు కడుక్కోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గజ్జల వారి చెరువు వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ, హెల్త్ సూపర్వైజర్ హైమావతి, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ వల్లే మెరుగైన సమాజం

సహకార సదస్సులో వక్తలు

నూజివీడు టౌన్ : సహకార వ్యవస్థ వల్లే అంతరాలు లేని మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ది విశాఖ కోపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యాన నూజివీడులో జరిగిన సహకార సదస్సులో వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025ను పురస్కరించుకుని విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యాన సోమవారం స్థానిక అమర్ భవన్ లో విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ చెన్నం కోటేశ్వరరావు అధ్యక్షతన సహకార సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, నూజివీడు డివిజన్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ ఎం.రవికుమార్, కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ జిఎం.రంగబాబు, మాజీ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మన నాగేశ్వరరావు, కృష్ణా జిల్లా మిల్క్ యూనియన్ డైరెక్టర్ ఎస్.జ్యోతి పాల్గొని ప్రసంగించారు. సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ సహకార వ్యవస్థ అంటే ఏమిటి అనేది పూర్తిగా అవగాహన చేసుకోవాలని, దీనికోసం క్షేత్రస్థాయి నుండి పరిశీలన అవసరమన్నారు. విద్యార్థి స్థాయి నుండి సహకారంపై దృష్టి సారించాలని, దేశంలో 30 కోట్ల మందిపైగా ప్రజలు సహకార రంగ ఫలాలను అందుకుంటున్నారన్నారు. సహకార వ్యవస్థ ద్వారా ఉన్నత శిఖరాలు అందుకోవచ్చు అని ఆమె పేర్కొన్నారు. పలు పాఠశాలలు, కళాశాలలో సహకార రంగంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సబ్ కలెక్టర్ వినూత్న చేతుల మీదగా బహుమతులు అందజేశారు.

లింగ సమానత్వంపై అవగాహన

జంగారెడ్డిగూడెం : ఛత్రపతి శివాజీ త్రిశతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యాన లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్ బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రధాన అతిథిగా పాల్గొన్న కళాశాల పూర్వ విద్యార్థి, కాలేజ్ డెవలప్మెంట్ ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యుడు, అడ్వకేట్, మాజీ బార్ కౌన్సిల్ అధ్యక్షులు అచ్యుత శ్రీనివాసరావు మాట్లాడుతూ గల్ఫ్ దేశాల్లో ఇప్పటికీ స్త్రీలు ఇంటికే పరిమితమై ఉన్నారని, భారతదేశంలో మాత్రం ఎన్నో పోరాటాలు, చట్టాల ద్వారా స్త్రీలకు సమాన హక్కులు లభించాయని చెప్పారు. స్త్రీ, పురుషులు ఎల్లప్పుడూ సమానమేనని, పరస్పరం గౌరవం ఇవ్వడం సమాజాభివృద్ధికి అవసరమన్నారు. మహిళా సాధికారిత విభాగాధిపతి సిహెచ్.రమాదేవి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ చలిమంటలో పడిన చిన్నారి

వైద్య ఖర్చుల నిమిత్తం జనసేన, బిజెపి నేతల సాయం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



నగదు సాయాన్ని అందజేస్తున్న నేతలు

మండలంలోని అంతర్వేదిగూడెం గ్రామానికి చెందిన కొమరం పుల్లారావు కుమార్తె తన్వి సోమవారం ఉదయం చలి కాగుతూ ఉండగా ప్రమాదవశాత్తు చలిమంటలో పడి 70 శాతం కాలిపోయింది. పాపను జంగారెడ్డిగూడెం సాయి స్ఫూర్తి ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న జనసేన మండల ప్రధాన కార్యదర్శి జిఎస్ఎన్.నాయుడు, బిజెపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ బాలిక వైద్య ఖర్చుల నిమిత్తం బాలిక తల్లికి రూ.5 వేల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షులు తీగల గోపాలకృష్ణ, జనసేన నాయకులు కైగాల సూరిబాబు, కొక్కెర పద్మరాజు పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - టి.నరసాపురం



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో మక్కినవారిగూడెం హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పథకాలు సాధించినట్లు హెచ్ఎం ఎల్.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. జంగారెడ్డిగూడెం మమత హాస్పిటల్ వారి సౌజన్యంతో పట్టణంలోని ఇండియన్ డిజిటల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఏలూరు జిల్లా అండర్-15 చెస్ టోర్నమెంట్-2025లో మండలంలోని మక్కినవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎల్.వెంకటేశ్వరరావు తెలిపారు. బాలికల అండర్ - 13 విభాగంలో తృతీయ స్థానం సాధించగా, గవర్నమెంట్ స్కూల్స్ విభాగంలో జిల్లా స్థాయిలో డి.ఉత్తేజ్ ద్వితీయ, కె.వెంకట సాయికృష్ణ తృతీయ స్థానం సాధించగా వై.అనసూర్య తేజ నాలుగవ స్థానం, పి.భార్గవ్ తేజ అయిదవ స్థానం సాధించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు టోర్నమెంట్ నిర్వాహకులు మెడల్, ప్రశంస పత్రంతోపాటు నగదు బహుమతి అందించినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో విజేతలకు అభినందన సభను ఏర్పాటు చేశారు. గెలుపొందిన విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రమేష్‌ను అభినందించారు. విజేతలను పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, తల్లిదండ్రులు, పలువురు గ్రామస్తులు అభినందించారు.

అక్కాచెల్లెళ్ల ప్రతిభ

జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో అండర్-7 విభాగంలో మండలంలోని చిన గుర్వాయిగూడెంకి చెందిన అక్కాచెల్లెళ్లు ఉత్తమ ప్రతిభ కనబరిచి పథకాలు సాధించినట్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.కన్నయ్య సోమవారం తెలిపారు. జంగారెడ్డిగూడెంలోని మమత హాస్పిటల్ వారి సౌజన్యంతో జంగారెడ్డిగూడెం ఇండియన్ డిజిటల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా అండర్-15 చెస్ టోర్నమెంట్-2025లో బాలికల అండర్-7 విభాగంలో గుడికందుల చిరన్వి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించగా, బాలికల విభాగంలో గుడికందుల జూహీ జిల్లా స్థాయి ది బెస్ట్ యంగెస్ట్ ప్లేయర్‌గా నిలిచినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన ఈ అక్కాచెల్లెళ్లకు టోర్నమెంట్ నిర్వాహకులు మెడల్, ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతి అందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

ముళ్ల మొక్కల తొలగింపు

మండవల్లి: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గ్రామస్తులు సహకారం అందిస్తే సమస్యలు ఇట్టే పరిష్కారం అవుతాయని సింగనపూడి గ్రామస్తులు రుజువు చేశారు. సింగనపూడి నుండి మోదుగుముడి, మండవల్లి వెళ్లే రహదారిలో దట్టంగా పెరిగిపోయిన ముళ్లమొక్కలను గ్రామస్తులు స్వచ్ఛందంగా సోమవారం తొలగించారు. సింగనపూడి నుంచి మోదుగుముడి వెళ్లే రహదారి వెంబడి పిచ్చి ముళ్ల మొక్కలు దట్టంగా రోడ్లపైకి పెరిగిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు వాహనాలు ఎదురెదురు పడినప్పుడు ముళ్లకంపలు గుచ్చుకొని వాహనదారులు గాయాలపాలవుతున్నారు. దీంతో పంచాయతీ దృష్టి తీసుకువచ్చినప్పటికీ పంచాయతీ పట్టించుకోకపోవడంతో సింగనపూడి గ్రామస్తులతో యువత కలిసి ముళ్లకంపలను పూర్తిస్థాయిలో తొలగించేలా చర్యలు చేపట్టారు. దీంతో పలువురు సింగనపూడి గ్రామస్తులను, యువతను అభినందించారు. కార్యక్రమంలో గోపిశెట్టి రవి, పెద్దిరెడ్డి బాబి తేజ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి : డిఎస్‌పి

జీలుగుమిల్లి: జీలుగుమిల్లి సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషిచేయాలని పోలవరం సబ్ డివిజన్ డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జీలుగుమిల్లి సర్కిల్ పరిధి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్‌ల పరిధిలో ఇటీవల నమోదైన కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణను తగ్గించే విధంగా సిబ్బంది కృషిచేయాలని కోరారు. ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై దృష్టి సారించాలని సిబ్బందికి ఆదేశించారు. సిఐ బి.వెంకటేశ్వరరావు, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి : ఎంఇఒ

ముసునూరు: 100 రోజుల ప్రణాళిక ద్వారా పదో తరగతి విద్యార్థులు చదివి అందరూ ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాశాఖ అధికారి బివిఎస్.సుబ్బారావు అన్నారు. సోమవారం చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం పదవ తరగతి చదివే విద్యార్థులతో మాట్లాడి ప్రభుత్వం చేపడుతున్న 100 రోజుల ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. అలాగే పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు మురారి శివ నాగమణి మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ విద్యార్థుల ఉత్తీర్ణత స్థాయి పెంచటానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. పాఠశాల స్టాఫ్ సెక్రటరీ జి.పద్మ కిషోర్, గుడిమెళ్ల రాంబాబు, అబ్రహం, బద్దు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - దెందులూరు

సమాజ అభ్యున్నతిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి గ్రామంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఎపియుడబ్ల్యుజె) దెందులూరు నియోజకవర్గ స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని పెదవేగి, పెదపాడు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లోని వర్కింగ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎన్‌జిఒ మండల అధ్యక్షులుగా కొండలు

ప్రజాశక్తి - మండవల్లి

ఎపి ఎన్‌జిఒ మండల యూనిట్ నూతన అధ్యక్షులుగా ముద్దినేని కొండలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లా యూనిట్ ఎపి ఎన్‌జిఒ ఎన్నికల అధికారి మెరుగు ఫణి కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మండల యూనిట్ ఎన్నికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలానికి నిర్వహించిన ఎన్నికలో గన్నవరం, కానుకొల్లు గ్రామాలలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ముద్దినేని కొండలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నారగని పద్మ, కార్యదర్శిగా ఎంవి.సుబ్బారావు కూడా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ ఎన్నికలో పి.సాంబశివరావు, లీలావతి పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి బాలల చదరంగం పోటీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెంలోని శ్రీహంస చెస్ అకాడమీ ఆధ్వర్యాన మమత మల్టీ స్పెషాలిటీ వారి సౌజన్యంతో ఇండియన్ డిజిటల్ స్కూల్‌లో నిర్వహించిన అండర్-15 జిల్లాస్థాయి చిల్డ్రన్ చెస్ టోర్నమెంట్ ముగిసింది. ఈ టోర్నమెంట్‌కు చీఫ్ గెస్ట్‌గా జంగారెడ్డిగూడెం ఎఎస్‌పి సుస్మిత రామ్‌నాదన్, మమతా హాస్పిటల్ డాక్టర్ రామాంజీ నాయక్, ఇండియన్ డిజిటల్ స్కూల్ ప్రిన్సిపల్ సోమరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని బాలలను ఉద్దేశించి ప్రసంగించారు. బాలబాలికలు సుమారు 170 మంది పాల్గొన్నారు. మొత్తం ఆరు రౌండ్లు జరిగిన ఈ టోర్నమెంట్లో మొదటి స్థానం పి.సుచిత్ర క్రిస్టీ(6 పాయింట్లు), ద్వితీయ స్థానం వి.బాల శ్రీకార్తిక్(5.5 పాయింట్లు), తృతీయ స్థానం ఎం.కుషాంక్ శ్రీవిశ్వ(5.5 పాయింట్లు) సాధించారన్నారు. వివిధ కేటగిరిలలో మొత్తం 39 నగదు బహుమతులు, 59 పతకాలు ఇచ్చారని, అంతేకాకుండా టోర్నమెంట్లో పార్టిసిపేట్ చేసిన ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ మెడల్, సర్టిఫికెట్ ఇచ్చారని టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ పి.కిరణ్‌కుమార్ తెలియజేశారు. ఈ టోర్నమెంట్ ఇంతటి ఘన విజయం సాధించడానికి సహాయ సహకారాలు అందించిన మమత హాస్పిటల్ యాజమాన్యం, ఇండియన్ డిజిటల్ స్కూల్ యాజమాన్యంకి టోర్నమెంట్ డైరెక్టర్ కన్నా సూర్య నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

మండల పరిషత్ ఆదర్శ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని మండల పరిషత్ ఆదర్శ పాఠశాలను ఎంఇఒ-1 ప్రసాద్, ఎంఇఒ-2 ఇ.జమలయ్య సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల వంట ఏజెన్సీలకు అధికారులు పలు సూచనలు చేశారు. వంట ఏజెన్సీలు పాఠశాలలోనే వంటలు చేయాలని సూచించారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మెనూ పాటించి బ్రాండెడ్ ఆయిల్, ఉప్పు వాడాలని తెలిపారు. పిల్లలకు భోజనం పెట్టేటప్పుడు కసరించుకోకూడదని తెలిపారు. వంటకి ఉపయోగించే నీరు ఫ్రెష్‌గా ఉండాలని సూచించారు.

నేడు జనవాణి

వేలేరుపాడు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10 గంటల నుండి జనవాణి కార్యక్రమంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పాల్గొననున్నారని వేలేరుపాడు జనసేన మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ ప్రకటన ద్వారా తెలిపారు. మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అర్జీల రూపంలో సమర్పించాలని, ప్రజలకు ప్రభుత్వం అందించే సేవలో ఉన్న లోపాలను గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను ఈవేదికపై తెలియజేయాలని అన్నారు. ఈ జనవాణి కార్యక్రమంలో ఎంఎల్ఎ చిర్రి బాలరాజుతో పాటు మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) నూజివీడు వారి కోర్టులో
ఓ.యస్.నెం.833/2020

బిట్వీన్ :
యర్రమిల్లి వెంకటేశ్వరరావు అనే వెంకటేసు ...పిటీషనర్
మరియు
పగుట్ల రత్తమ్మ మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్
టు
రెస్పాండెంట్స్ :
4వ రెస్పాండెంట్ : పగుట్ల మార్తమ్మ, తండ్రి ఏసోబు, వయస్సు 60 సం॥లు, నివాసం: పోతురెడ్డిపల్లి గ్రామం, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా.
6వ రెస్పాండెంట్ : పగుట్ల కృపారమ్మ, తండ్రి ఏసోబు, వయస్సు 42 సం॥లు, నివాసం: పోతురెడ్డిపల్లి గ్రామం, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు పిటీషన్‌లో 4,6 రెస్పాండెంట్స్ అయిన మీరు పైన పేర్కొనిన శ్రీకోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గానూ వాయిదా ది.17-12-2025వ తేదీన వున్నది. సదరు తేదీన ఉదయం గం.10.30 ని॥లకు మీరు స్వయంగా గానీ, మీ న్యాయవాది గారి ద్వారా గానీ శ్రీకోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమునందు తీర్మానించుదురు.

ఆర్.వి.సత్యనారాయణ
నూజివీడు పిటీషనర్ తరపు న్యాయవాది
తేది.6.11.2025 నూజివీడు, ఏలూరు జిల్లా.